# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాజధాని అమరావతిలో 40 వేల కోట్ల రూపాయలతో నిర్మాణ పనులను చేపట్టామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు.**
2. **రాష్ట్రాన్ని సారా రహితంగా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**
3. **రాష్ట్రంలో కార్మికుల భద్రతే లక్ష్యంగా భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.**
4. **తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సాలకట్ల తెప్పోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమవుతున్నాయి.**
5. **ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025లో భాగంగా మరికొద్ది సేపటిలో ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి.**

==========================

రాజధాని అమరావతిలో 40వేల కోట్ల రూపాయలతో నిర్మాణ పనులను చేపట్టామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, సీఆర్డీఏతో పాటు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మాణ పనులకు పిలిచిన టెండర్లను తెరిచామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయని, ఈ నెల 12 నుంచి రాజధానిలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఇప్పటి వరకూ 40 వేల కోట్ల రూపాయల విలువైన నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్లను తెరిరిచామని మంత్రి వివరిస్తూ...

వాయిస్ ..26 సెకన్లు

--------------------------

రాష్ట్రాన్ని సారా రహితంగా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అనకాపల్లిలోని స్థానిక పెంటకోట నవోదయం 2.0 ప్రచార రథాన్ని పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్ తో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం గోడ పత్రికలు, కరపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, సారా తయారీ, రవాణా విక్రయాలు కొనసాగించే వారిపై ఇకపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా అర్హులైన

వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి పొందేలా చర్యలు చేపడతామని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నాటు సారాకు వ్యతిరేకంగా ప్రచార రథం ద్వారా అవగాహన కల్పించనున్నామని మంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్రంలో కార్మికుల భద్రతే లక్ష్యంగా భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. అనకాపల్లి జిల్లాలో మంత్రి ఈరోజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో … అనకాపల్లి జిల్లాలోరసాయన పరిశ్రమలు అధికంగా ఉన్నాయని చెప్పారు. వీటిలో భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్రంలోనే తొలిసారిగా భద్రతా వారోత్సవాలను ఇక్కడి నుంచి ప్రారంభిస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి వాసం శెట్టి సుభాష్ పేర్కొన్నారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సాలకట్ల తెప్పోత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ ఉత్సవాలకు టీటీడీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈరోజు రాత్రి 7 గంటలకు ప్రారంభమైయ్యే తెప్పోత్సవాలు ఈనెల 13వ తేదీ వరకు జరుగుతాయి. ప్రతి రోజు రాత్రి 7 నుంచి 8 గంటల వరకు మలయప్ప స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో విహరిస్తారు. ఏటా ఫాల్గుణ మాసంలో శుద్ధ ఏకాదశినాడు ప్రారంభమయ్యే తెప్పోత్సవాలు పౌర్ణమి వరకు జరుగుతాయి.తెప్పోత్సవాల కారణంగా ఈ నెల 13వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకారణసేవలను రద్దు చేసినట్లు టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

విశాఖ పట్నంలోని రుషికొండ బీచ్ కు ప్రతిష్ఠాత్మకమైన బ్లూ ఫ్లాగ్ గుర్తింపు తిరిగి లభించేలా చర్యలు చేపడుతున్నామని భీమిలి శాసనసభ సభ్యులు గంటా శ్రీనివాసరావు తెలిపారు. రుషికొండ బీచ్‌ని ఆయన ఈరోజు సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం శ్రీనివాసరావు పాత్రికేయులతో మాట్లాడుతూ, బ్లూ ఫ్లాగ్ ధృవీకరణకు అనుగుణంగా సీసీ కెమెరాలు, సౌచాలయాలు, నీటి నాణ్యత వంటి.సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పునరుద్దరణ పనులు చాలావరకు పూర్తయ్యాయని ఆయన తెలియజేస్తూ,

వాయిస్.. 28సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఖేలో ఇండియా పథకం ద్వారా క్రీడలకు వసతులు కల్పించేలా నిధులు కేటాయించాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చింతన్ శివిర్ సమావేశంలో రాంప్రసాద్‌రెడ్డి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్బంగా కేంద్ర క్రీడాశాఖ మంత్రితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో క్రీడా సముదాయ నిర్మాణం కోసం 42.62 కోట్లు కేటాయించాలని, జిల్లా స్థాయి ఖేలో ఇండియా హాకీ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆధునికీకరణకు 27.48 కోట్లు కేటాయించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

---------------------------

జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిన్న నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఒక్క రోజే 49 వేల 56కు పైగా కేసులు పరిష్కారమయ్యాయని న్యాయసేవాధికార సంస్థ ఒక ప్రకటలో తెలిపింది. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, మార్గదర్శకాల్లో రాష్ట్రంలోని దిగువ న్యాయస్థానాల్లో 343 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించమని పేర్కొంది. అలాగే హైకోర్టు ప్రాంగణంలో రాష్ట్ర హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జస్టిస్ హరిహరనాథశర్మ, జస్టిస్ వై.లక్ష్మణరావు పాల్గొని 125 కేసులను పరిష్కరించారని వెల్లడించింది.

---------------------------

భారత్‌ను అంతర్జాతీయ వినోద రంగానికి కేంద్రంగా మార్చేందుకు, వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టెయిన్ మెంట్-వేవ్స్ 2025 సదస్సును ముంబైలోని జియో వరల్డ్ గార్డెన్స్‌లో మే 1 నుంచి 4వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. దేశంలో మీడియా-వినోదరంగం అభివృద్ధి, వాణిజ్యపరమైన అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా సృజనాత్మక, ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో. "క్రియేట్ ఇన్ ఇండియా" పేరుతో 31 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు.

..ప్రోమో...

గోదావరి నదీజలాల వివాదాలు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని గోదావరి నది నిర్వహణ బోర్డు -జీఆర్ఎంబీ ఛైర్మన్ అజయ్‌కుమార్ ప్రధాన్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని సీలేరులో జలాశయాలు, జలవిద్యుత్ కేంద్రాలను జీఆర్ఎంబీ బృందం నిన్న తనిఖీ చేసింది. బలిమెల జలాశయంలో నీటి పంపకాలు, వాడకాలపై ఆంధ్రప్రదేశ్, ఒడిశా అధికారులతో చర్చించింది. అనంతరం సీలేరు జలాశయాన్ని సందర్శించి, జలవిద్యుత్ కేంద్రానికి చేరుకుని యూనిట్ల పనితీరును పరిశీలించింది. పార్వతీనగర్ వద్ద పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టు నిర్మించే ప్రాంతాన్ని సందర్శించింది. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు స్నేహపూర్వకంగా బలిమెల, జోలాపుట్ జలాశయాలను నిర్వహిస్తున్నాయని సభ్యులు పేర్కొన్నారు.

---------------------------

దుబాయ్ వేదికగా జరిగే చాంపియన్స్ ట్రోఫీ-2025 లో భాగంగా మరికొద్ది సేపటిలో ఫైనల్ మ్యాచ్‌లో భారత్ న్యూజిలాండ్ జట్లు పోటీపడనున్నాయి. సెమీ ఫైనల్స్‌లో ఆస్ట్రేలియాపై భారత్ విజయం సాధించగా, న్యూజిలాండ్.. సౌత్ ఆఫ్రికాపై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్ ఈ మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు ప్రారంభమవుతుంది.

---------------------------

స్వాతంత్ర్య సమరయోధులు, బహు భాషావేత్త బెజవాడ గోపాల రెడ్డి వర్ధంతి ఈరోజు. ఆంధ్ర రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగాను, ఉత్తరప్రదేశ్‌కు గవర్నర్‌గాను సేవలందించిన ఆయన... నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో 1907 ఆగష్టు 7వ తేదీన జన్మించారు. 11 భాషల్లో పండితులైన గోపాల రెడ్డి అనేక పుస్తకాలు రచించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన గీతాంజలి, ఊర్వశి వంటి పలు రచనలను తెలుగులోకి అనువదించిన గోపాల రెడ్డి 1997 మార్చి 9వ తేదీన కన్నుమూశారు.

=====================